కథానిక

# హద్దుమీరిన అధికారం

పి. వి. పల్లి

నా పెళ్ళయి ఆర్నెల్లకాలం గడిచింది. పండగకి రమ్మని మా మామగారు స్వయంగావచ్చి పిలవడంవల్లనూ, యీ మధ్యకాలంలో మా సరోజ వచ్చి, రెండుదినాలుమాత్రమేవుండి వెళ్లిపోవడం వల్లనూ, మా సరోజ వ్రాసిన ఉత్తరంలో వాడిన భాష నన్ను ఆమెని చేరుకోవాలని ఆత్రుతపరచడంవల్లనూ—పండగ వారందినాలుందనగానే బయలుదేరాను. అయితే కొంత బస్సుప్రయాణమూ కొంత రైలుప్రయాణమూచెయ్యాలి. మా వూరికి రైల్వేస్టేషను సుమారు ముప్ఫయిమైళ్లుంటుంది.

మా స్కూలికి నేనే సర్వాధికారిని. పండగకి ఎలాగూ నేను వెళ్ళాలికదా అని, వారందినాళ్ళు ముందుగానే స్కూలుకి శెలవులిచ్చాను.

ఉదయం ఎనిమిదిగంటలకి బస్సుయెక్కితే, స్టేషనుకువెళ్ళేసరికి, ఎంత ఆలస్యంగా వెళ్ళినా పదకొండుగంటల లోపుగానే చేరుకోవచ్చును; పదకొండున్నరకల్లా ప్యాసెంజరు వస్తుంది.

పెట్టె, బెడ్డింగు, సాయంత్రమే సర్దేశాను. మానాన్న, రాత్రిభోజనాలసమయంలో చెప్పారు జాగ్రత్తగావెళ్ళిరమ్మని. ఉదయం దుర్ముహూర్తాలు చూసుకు మరీ బయలుదేరమని హెచ్చరించారు.

వాచీని పండక్కి యిస్తామని వాళ్లు చెప్పినందున మా నాన్న ఉపేక్షించినా, నేనుమాత్రం ...స్తులు పనూలుచేసుకు వాచీ కొనుక్కోవడం, యీ ప్రయాణానికి యెంతోపనికొచ్చింది.

బాగాముస్తాబై-బస్సుయెక్కాను. అయితే, కొత్త పెళ్ళికొడుకుని; పెళ్ళి అయింతర్వాత 'తండ్రి" అయ్యేదాకా అలాగే చెలామణీ అవుతాని మా పెత్తండ్రి ఎవరితోనోచెప్పగా విన్నాను. ...ంచేత ఫ్రంటుసీటులోకూచుందామని మనసు ...ందుకిలాగింది. అయినా, ఓసారి అలాగే ...ార్చుంటే, కలక్టరాఫీసు శిరస్తాదారు రెండో ...ట్లోకూచున్నా, ఎర్రటోపీరాగానే, నాకు స్థాన ...లనంకలగడం మరచిపోలేదు. అంచేత బుద్ధిగా రెండో సీట్లోనే కూర్చున్నాను. మొదట్లో కూచుంటే వచ్చేపోయేవాళ్ళరద్దీ యెక్కువగా వుంటుందని చివరగా కూర్చున్నా.

సరిగ్గా ఎనిమిదింపావు అవగానేబస్సు బయలుదేరింది. అందరి ముఖాలూ ఓసారి దీక్షగా చూచాను, నాలాగా బాగా ముస్తాబై అత్తవారింట్లకి వెళ్ళేరకం కనుపిస్తుందేమోనని. కాని పరాజితుణ్ణయ్యాను. మా సీట్లో ఆరుగురం కూచున్నాం. అందరూ, నాకన్న పెద్దవాళ్ళే. ఖద్దరు వస్త్రధారులు ముగ్గురూ; సూట్లు వేసుకున్నవాళ్లు యిద్దరూ, గ్లాస్గోపంచీ, కళ్లీలాల్చీధారుణ్ణి నేను.

రెండు మైళ్ళు నడిచింది బస్సు. నేను ప్రతి ఫర్లాంగు రాయినీ, మైలురాయినీ నిశితంగా పరిశీలిస్తున్నాను. రెండో మైలురాయి దాటగానే బస్సు ఆగింది. ఇద్దరు వ్యక్తులు బస్సుదగ్గరకొచ్చి సీటు కావాలన్నట్లు కండక్టరుకేసి చూశారు. ఫ్రంటుసీటులోవున్న ఒక కళ్ళద్దాలాయన రెండో సీట్లో కొచ్చాడు. మరొకాయన వెనక సీటులోకి పోయాడు.

మళ్ళీ బస్సు ముందుకిసాగింది. నా మనస్సు బస్సువేగంకంటె యెన్నో రెట్లు జోరుగా పోతున్నది. బస్సు కుదుపు నా మనస్సుని భగ్నంచెయ్యలేక పోయింది. కాని శరీరంమాత్రం నొప్పులు పెట్టినట్లయిపోయింది. ప్రభుత్వంవాళ్ళు కంట్రాక్టర్లచేత బాగా బాగుచేయించిన రోడ్లమీద ఎంత సున్నితంగా పోతుందో బస్సు అనిపించింది. ఎలాగైతేనేం—రోడ్డు కిరువైపులా కనబడే బీటలు వారిన పొలాలు, చెట్లు చూస్తూండగానే, బస్సు మళ్ళీ ఆగిపోయింది. పదో మైలురాయి దాటి రెండో ఫర్లాంగు రాయిదగ్గర ఆగింది బస్సు. ముందుకి చూచాను. ముగ్గురవుపించారు. ఎందుకో నాగుండెలు గతుక్కుమన్నయి. చేరుకోబోతున్న గమ్యస్థానంచాలాదూరంగాజరిగిపోయినట్టయింది. మా ఆవిడ ఎలుగెత్తి నన్ను పిలుస్తున్నా దగ్గరగా వెళ్ళడానికి సాహసించలేని పరిస్థితిలో పడ్డాను.

కాకీనిక్కర్లు - పోలీసువాళ్ళ డ్రస్సు. యెర్ర టోపీలవారిద్దరూ ఒక సబ్ యినస్పెక్టరున్నూ. కండక్టరు ఎదురుగావెళ్లి చేతులు జోడించుకుని నిలబడ్డాడు. బస్సులోవున్న తోటి ప్రయాణీకుల మొహాలన్నీ - కనిపించినంతవరకు-పరిశీలనగా చూచాను. అన్ని మొహాలూ వివర్ణంగా అవుపించాయి. నిట్టూర్పులతో బస్సు నిండిపోయింది. డ్రైవరు హేండిలుమీద రెండుచేతులూ తలా ఆనించి ఒక్క క్షణం కూచుని, మళ్లీ దిగిపోయి కండక్టరుకి ప్రక్కగా నిలబడ్డాడు.

"మేం పట్నంవస్తున్నాం"అన్నాడధికారి.

"అడ్డు యేముంది"న్నట్లు, యిద్దరు కానిస్టేబిల్సు చరచరా బస్సుదగ్గరకొచ్చి వెనకసీట్లలో కూచున్నారు. అధికారి ఫ్రంటుసీటుకి కాస్త దూరంలోనిలబడి, రెండుచేతులూనిక్కరుజేబుల్లో పెట్టుకుని నెపోలియన్ పోజు పెట్టి దీర్ఘంగాచూస్తున్నాడు, ఫ్రంటుసీటు కాళీచెయ్యమన్నట్లు.

ఫ్రంటుసీట్లోకూచున్న యిద్దరూ ఒకరిముఖాలొకరు చూచుకొంటున్నారు. ఖద్దరువస్త్రధారి తన దుస్తులను సవరించుకుని, తల కిందకి దించేసుకున్నాడు, తనని "లెమ్మ"నరనే ధీమాతో. రెండో ఆయన ఎర్రగాచూస్తూన్నాడు అధికారివేపు, తన ఫేంటుని ఒక్కసారి సరిచేసుకుని.

"ఏయ్ కండక్టర్..."అని గద్దించాడధికారి, మూతిమీది మూడుపుంజీల వెంట్రుకల్ని సరిచేసుకుంటూ.

"బాబూ--ఎవరోఒకరు..."నసుగుతున్నాడు ఫ్రంటుసీటుదగ్గరకొచ్చి.

"అలా వీల్లేదు .ఎవరు దిగిపోవాలోచెప్పు" అన్నాడు సూటుధరించి వ్యక్తి, ప్రక్కాయన వేపుచూస్తూ.

"తమరు దిగిపోవాలిబాబూ—" అన్నాడు కాస్త ముందుకువంగి, కండక్టరు.

తననికాదన్నట్లుగా డ్రైవరుమీంచి—బాలాల్లోకి చూస్తున్నాడు ఖద్దరువస్త్రధారి.

"పోనీ రెండోసీట్లోకివచ్చెయ్యండి తమరు" అన్నాడు కండక్టరు, సూటువేసుకున్నవ్యక్తిని.

"అదెంతమాత్రమూ జరగనిపని. నేను రివెన్యూ యిన్స్పెక్టర్ని. తెలుసా——బస్సుదిగి పోమంటే చెప్పు..."

"ఆఁ...అంతమాట అనకండి..."

"పోనీలేవయ్యా. ఎక్కడుంటేనేం" అంటూ ఖద్దరువస్త్రధారి, రెండోసీట్లోకివచ్చేశాడు. ఏడుగురం యింతకుముందే కూచున్నాం. ఎనిమిదో వ్యక్తికి ఖాళీలేదు. అయినా ఎలాగోసర్దుకున్నాం.

రీవిగా రెండు అడుగులు ముందుకివేసి సూటు వేసుకున్నమనషిని లోపలికి జరగమని, ముందు కూచున్నాడధికారి.

"బ్రతుకుజీవుడా"అనిపించింది అందరికీ, బస్సు కదిలింది. పిల్లవాయువులు, మెల్లగావీవడం మొదలెట్టాయి.

పన్నెండో మైలురాయి దాటగానే మళ్ళీ బస్సుకి సడన్ బ్రేక్ పడింది. చూద్దునుకదా ఒక రెండెడ్లబండి కుడిప్రక్కగా పారిపోతూంటే, డ్రైవరు సంజ్ఞవల్ల ఆగిపోయింది.

అధికారి దిగ్గానే, అనుచరులుకూడా దిగారు. బండిమనిషిని పిలిచారు. మారుమాట లేకుండా బండిమనిషినిచావమోదుతున్నాడధికారి. కాలితో తన్నుతున్నాడు. అప్పటికీ కోపంఆగక పీకపట్టుకుని రోడ్డుప్రక్కనున్న గోతిలోకి త్రోసేశాడు.

"ఏయ్! వాడిపేరు నోట్ చెయ్యి" ఆజ్ఞాపించాడు. సూటాయన అన్నాడు, "కావాలి. అలా అయితేగాని బుద్ధిరాదు, ఊళ్ళోకి కలక్టరుకి వెళితే ఒకడూ సరిగా చెల్లించడుకదా!"

"ఏస్. ఉన్నమాటన్నారు" అన్నాడు అధికారి బస్సు యెక్కుతూ.

నాకు ఉద్రేకం పుట్టుకొచ్చి, "అవును!" అన్నాను నిస్పృహగా, ఉద్రేకాన్ని తగ్గించుకుని.

బస్సు మళ్లీ సాగిపోయింది.

యిరవై రెండో మైలురాయి యెల్లావచ్చిందో నాకేతెలీదు. అంత స్పీడ్ గా నడిచింది బస్సు. మళ్ళీ ఆగిపోయింది. ఇంకా ఎనిమిది మైళ్ళుంది పట్నం. అదే స్టేషను. అప్పుడే పదకొండుకి, యిరవై నిముషాలు తక్కువ. నా హృదయాన్ని యెవరో కోసేస్తున్నట్లనిపించింది. ట్రెయిను అందుతుందా? అందదా? "ఓ పరమేశ్వరా! ఎలాగన్నా ట్రెయిను అందేటట్లు చెయ్యి"అని దేవుణ్ణి ప్రార్థిస్తూ శూన్యంగాచూస్తూ వుండిపోయాను.

ఇంతలో ఒకాయన రొప్పుకుంటూవచ్చి బస్సు యెక్కాడు. అధికారి ఫ్రంటుసీటులోలేదు. అనుచరులుంటారేమోనని వెనక్కిచూచాను. వాళ్ళూ లేరు. దిక్కులు చూచాను. అరఫర్లాంగు దూర

ములో తాటిచెట్లతోపులో అవుపించారు ముగ్గురూను. అక్కడ యేంచేస్తున్నారో నాకు బోధపడలేదు. మూడు నిమిషాలు గడవగానే ఒక బీద రైతు ఏడుపు వినబడుతూంది. కారణం యెవరికీ అర్థంకాలేదు.

"ఏంపాపం చేసుకున్నాం భగవంతుడా!" అని డ్రైవరు ముందున్న హేండిలుమీద బుర్ర పెట్టుకుని ఆలోచిస్తున్నాడు.

"తుమ్మితూంటే బయలుదేరాం" అన్నాడు క్లీనరు, ముందున్న మడ్గారుమీద చతికిలపడి.

"ఎవరి మొహం చూచామో యివాళ" అని అంటూ కండక్టరు కాస్తఘేరువుగావున్న ఫర్లాంగు రాయిమీద ఒకకాలు ఆనించికూచున్నాడు.

"బాబూ మా ఆడదానికి చాలా జబ్బుగుంది డాక్టర్ని తీసుకురావాల. తొరగా పోనియ్యండి బాబూ మీకు పుణ్యం వుంటుంది" అన్నాడు, యిందాకా యెక్కిన పల్లీయుడు.

ట్రెయిను తప్పిపోతుందన్న ఆదుర్దా తప్పితే మరో ఆలోచనేలేదు. ఆ ట్రెయిను తప్పితే రాత్రి పన్నెండు గంటలదాకా, ఆతట్టు పోయే ట్రెయిను లేదు. ఆ రైలుమీద వెళ్ళినా, రేపు యీ ట్రెయినుకే వెళ్ళినా ఒకటే. క్షణం ఒక యుగంగా గడిపిన నాకు, యీ ప్రయాణం ప్రాణసంకటంగా వుంది.

"నాయినా-పిల్లలు ఏడుస్తున్నారు. పదకొండయింది. యింకా చేరుకోకపోతే ఎలా యిల్లు?" అన్నది ఒకావిడ వెనకసీట్లోంచి.

"కోర్టుకి టైమయిపోతూందయ్యా - సరిగ్గా పదకొండయ్యేసరికల్లా మునసబు గద్దె యెక్కుతాడు. ఇవాళ మా కేసు విచారణ. కాస్త త్వరగా పోవాలి" అన్నాడు బొద్దుమీసాల పెద్దమనిషి మా సీట్లోంచి.

ఇలా మనిషికొకవిధంగా గోలచేస్తునేవున్నాం. సరిగ్గా పదకొండూ అయిపోయింది. కండక్టరు మీద విరుచుకుపడ్డం మొదలెట్టారందరూ.

యీ బాధ భరించలేక, తడబడే అడుగులతో, బుర్రగోక్కుంటూ, అధికారిని సమీపించాడు. యితను యేమన్నాడో వినిపించలేదుగాని, అధికారిమాటలు బాగా వినిపించాయి.

"ఓవర్‌లోడు చేస్తున్నట్లున్నదే? సరిగ్గా కెపాసిటీగావుంచు—"

కండక్టరు మొహం తేలవేసుకుని వచ్చాడు. మరో అయిదునిమిషాలకి అధికారి, అనుచరులు వచ్చి బస్సుయెక్కారు. బాగా వొళ్ళుమండిందేమో, డ్రైవరు నలభైమైళ్ళకిపైగా స్పీడుతో బస్సుని పోనిస్తున్నాడు.

ప్రాణంలేచివచ్చింది నాకు, యిక ఫరవాలేదనుకున్నాను. తప్పకుండా రైలుకి అందుకోగలను. నలుప్రక్కలా చూచాను రీవిగా వచ్చేసంతోషాన్ని అపుకుంటూ. ఇందాకా రొప్పుకుంటూ వచ్చిన మనిషి మొహం ఆశ నిరాశలమధ్య అల్లాడుతున్నది. అవును పాపం, యెల్లావుంటుందో? అని బెంగ. డాక్టరు వెళ్ళిందాకానన్నా బ్రతికి వుంటే ఫర్వాలేదు అనిపించిందినాకు.

నాలుగుమైళ్ళుందనగానే మళ్ళీ బ్రేకుపడింది. దించినతల యెత్తి చూదునుగదా అదొక పోలీసు స్టేషను. అక్కడ హెడ్ కానిస్టేబుల్ మరోఅయిదుగురు పోలీసులువున్నారు. చీట్లపేక ఆడుకుంటున్నారు, బస్సు ఆగిందనగానే పేకమాయమైంది అందరూ వరసగా నిలబడి అధికారికి సైనిక వందనం చేశారు.

అధికారి కుర్చీలో కూచుని రికార్డు తిరగ వెయ్యడం మొదలుపెట్టాడు. అనుచరులు గుమ్మం దగ్గర నిలబడ్డారు.

"అయ్యా నన్నేమీ అనకండి. చేతనైతే ఆయన్నే అడగండి" అన్నాడు కండక్టరు.

సూటుమనిషి ముందుకి వెనక్కి కునికిపాట్లు పడుతున్నాడు.

"బాబో పోనియ్యండి బస్సుని మా ఆడదాని కెలాగుందో" అని పెద్దగా ఏడవటం మొదలెట్టాడు యిందాకటి మనిషి.

చరచరాబస్సుదిగాను. నావెనకాల కోర్టుమనిషి కూడా వచ్చాడు. పోలీసు అధికారిని సమీపించాం.

"అయ్యా బస్సుని యిట్లా అన్యాయంగా నిలబెట్టడం న్యాయంకాదు" అన్నాను కోపాన్నంతనీ దిగమింగుకుని. అధికారితలెత్తి - తనని కాదట్లు మళ్ళీ దించేసుకుని, కాగితాలు తిరగెయ్యడం మొదలెట్టాడు.

నాకు వొళ్ళుమండింది.

"యిదేంబాగాలేదు. యెంతోమంది మీ ఒక్కరికోసం బాధపడుతున్నారు. మీరు రండి-వస్తే.

లేకుంటే మరో బస్సులో రండి, మేం పోతాం-నాకు కోర్టు పనివుంది”

అన్నాడు విసురుగా కోర్టు మనిషి—

“అలాగే...”బీక్తరంగా అన్నాడధికారి.

“అవును సార్-వస్తే రండి—లేకపోతే మేం వెళ్ళిపోదాం-” అంటూ యిద్దరంవచ్చి బస్సులో కూచుని

పోనిమ్మన్నాం.

“అయ్యా- వీళ్లతోటే వుంది మా బ్రతుకు. కత్తికి రెండువైపులా దారుంటుది-” అన్నాడూ కండక్టరు ప్రాధేయపూర్వకంగా-

“అలాగను - యిప్పటికైనా తెల్సిందా?-” అన్నాడధికారి హుందాగా నడుస్తూ ముందుకొచ్చి. బస్సుస్టేషన్ దగ్గర ఆగిందనేసరికి రైలు కూసింది. పోనీ నడుస్తున్న రైలు ఎక్కిపోదామన్నా బ్రిడ్జిమీంచిపోవాలె. ఏంచెయ్యడానికీ పాలుపోలేదు. అలాగే వెయిటింగ్‌హాల్లో వున్న బెంచీమీద కూలబడ్డాను.

---

కథానిక

# చేబదులు దంపతులు

ఓగేటి శివరామకృష్ణ

“ఏమండీ ఒకరూపాయుంటే బదులిస్తారా. ఆనకమావారొచ్చినతర్వాత అడిగిస్తాను.” ప్రక్కవాటాలో విశాలాక్షి ఉదయం పదిగంటల వేళ, ప్రభాకరం భోజనంచేస్తూంటే, దొడ్డి గుమ్మానవచ్చి, వరలక్ష్మినిపిలిచి అడిగింది.

“ఏం—అండీ?”వరలక్ష్మి ఉన్నదీలేనిదీ తేల్చి చెప్పక అడ్డుప్రశ్న వేసింది!

“ఆc. ఏంలేదు. మంచి సవరాలొచ్చాయి. నల్లగా మంచిపొడుగ్గా ఉన్నాయి. రూపాయిన్నర అంటున్నాడులెండి. బేరం అడుతే... లెండి రూపాయకిస్తాడేమోనని!”అందివిశాలాక్షి.

“సవరాలా! మొన్న జబ్బుతో నా జుట్టంతా ఊడిపోయింది. నేనుగూడా ఒకటి కొనుక్కుంటే బాగుండును లెండి! నాదగ్గరయేంలేదు”అని ఊరుకుంది వరలక్ష్మి.

“మరేలాగండి! ఏ లా గో లా సర్దుబాటు చెయ్యాలి.” ఆనక మావారొచ్చినతర్వాత మీకు తప్పకుండా సర్దుబాటుచేయగల్ను”అని ధీమాగా అంది విశాలాక్షి.

“ఏంచేయమంటారు?”

“అన్నయ్యగారింట్లోనే ఉన్నారుగా... ఒక్కటేఒక్కరూపాయి అడిగిపుచ్చుకోండి. మావారు రావటంతోటే మీచేతికే యిచ్చేస్తాను” అంది విశాలాక్షి.

వరలక్ష్మి కాదనలేకపోయింది.

“అసలాయనదగ్గర ఉన్నదోలేదో కనుక్కోవాలిగా”అనిమాత్రం యేలాగో అంది.

విశాలాక్షి అంతటితో ఊరుకుంటేగా.

“అదేమిటమ్మా! నెలకు నూటయాభై రూపాయలు జీతంపుచ్చుకుంటున్న మీవారిదగ్గర డబ్బుకులోటేమిటి? తప్పకుండా ఉంటుంది”అంది.

వరలక్ష్మి మరి నోరు మెదపలేకపోయింది. ఆమె అన్నదానిలో అసత్యం ఏమైనా ఉంటేగా “కాదనటాని”కి. నెలకి నూటయాభైరూపాయలు సంపాదించుతున్నమాట వాస్తవం. పిల్లాపీచూ లేకపోవటంవల్ల యేకొద్ది మొత్తమో, ప్రతీనెలా బ్యాంకులో నిలవకు చేరుతూందనే మాటలో గూడా అసత్యం ఉండదు.

“సరే కనుక్కుంటానుండండి.”వరలక్ష్మి లోపలకెళ్ళింది. మరి తానక్కడుండటం, తనకే నష్టంగా తోచిందికాబోలు, విశాలాక్షి, వెళ్ళిపోయి వీధిలో సవరాల అబ్బాయితో బేరాలు సాగిస్తోంది.

ఇంతవరకూ అన్నిమాటలూ, ప్రక్కనుంచే ప్రభాకరం వినిఉండటంవల్ల, తిరిగి వరలక్ష్మి విషయాలు చెప్పనవసరంలేకపోయింది.

“ఏమండీ! రూపాయి బదులుకావాలట.”

“ఉహూ లేదే” అన్నాడు ప్రభాకరం.

“ఉన్నదో లేదో నాకేంతెల్సు! ఆవిడ అడిగింది. నూటయేభై రూపాయలు జీతం సంపాదించుకునే మీదగ్గర లేకపోవట మేమిటమ్మా అంది. లేదంటే నామాట నమ్మదు. పైగా అహం